క్లుప్తంగా

ఉచిత శిక్షణ ఇవ్వాలని వినతి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన అభ్యర్థులకు టెట్, డీఎస్సీ పరీక్షలకు ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియర్ అందజేస్తే నిరుద్యోగ గిరిజన యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గిరిజన విద్యార్థి సంఘ నాయకులు పల్ల సురేష్, డి.సురేష్, ఎ.చంద్రశేఖర్, పి.భగవాన్, ఐ.రామక్రిష్ణ, ఆర్. లవరాజు తదితరులు ఉన్నారు.

శాకాంబరిగా పారమ్మతల్లి


శాకాంబరిగా దర్శనమిస్తున్న పారమ్మతల్లి

సాలూరు: పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండ వద్ద గల పారమ్మతల్లి మంగళవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాస దశమి సందర్భంగా అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థి దశలోనే నాయకత్వం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంగరాజు

సాలూరు: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంగరాజు అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టి ట్యూర్ సెర్మని కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిత్తశుద్ధి,అంకిత భావం, నిబద్ధత తదితర లక్షణాలు నాయకుడికి ఉండాలని వివరించారు. లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో .ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొంకి వీధిలో వెలసిన అమ్మవారు


పూజలందుకుంటున్న కొంకివీధిలో వెలసిన అమ్మవారు

సాలూరు: పట్టణంలోని కొంకివీధిలో దుర్గమ్మ వెలసింది. వీధిలో దుర్గమ్మను కొలుస్తున్న ఓ కుటుంబానికి కలలో అమ్మవారు వచ్చి నేను కొంకి వీధి సమీపంలో ఓ ప్రాంతం వద్ద వెలిశానని చెప్పింది. ఈ మేరకు అమ్మవారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి తుప్పలను తొలగించగా అక్కడ అమ్మవారి ప్రతిరూపం కనిపించింది. దీంతో భక్తులు తండోపతండాలుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్య సాధన దిశగా యువత కృషి చేయాలి


లైబ్రరీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక చర్చివీధిలో గల గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాట్లాడారు. ఎంతవరకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నవి, ఏ పోటీ పరీక్షకు ఏ విధంగా సాధన చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. గ్రూప్–1తో పాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని విద్యార్థులు కలెక్టర్‌కు తెలపగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతీ, యువకులు నిరంతర కఠోర సాధన, ఏకాగ్రతతో ఎంచుకున్న లక్ష్య సాధన దిశగా కృషిచేసి ఉత్తమ ఫలితాలను పొందాలని పిలుపునిచ్చారు. ఆత్మన్యూనతను విడనాడి విషయ అన్వేషణను అలవరుచుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరీక్షణ

- నిరుద్యోగ భృతిపై నోరుమెదపని కూటమి ప్రభుత్వం
- హామీ అమలుపై అనుమానాలు
- ఆందోళనలో యువత



గుమ్మలక్ష్మీపురం:

అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు చొప్పున్న 20 లక్షల ఉద్యోగాలిస్తాం. ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్క నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊదర గొట్టారు. వారి హామీకి ఆకర్షితులైన యువత కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా హామీ అమలుపై స్పష్టత ఇవ్వకుండా మొహం చాటేసింది. ఈ పరిణామం నిరుద్యోగుల్లో ఆగ్రహావేశాలు నింపుతోంది. సీఎం చంద్రబాబు వ్యవహారశైలి చూస్తుంటే 2014లో మాదిరిగానే హామీని గాలికొదిలేస్తారేమోనని నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

భృతి తక్షణమే ఇవ్వాలి



డిగ్రీలు పూర్తిచేసి వేలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి. – వాటక శ్రీరాములు, జర్న, గుమ్మలక్ష్మీపురం మండలం

స్పష్టత ఇవ్వాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల ఉద్యోగ నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి. – సామల ప్రశాంత్, గొయిపాక గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

గతంలో మాదిరి మోసం చేయొద్దు



గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా జనరల్ అభ్యర్థులతో పాటు అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివి నిరుద్యోగులందరికీ భృతి చెల్లించాలి. – కద్రక గుంపస్వామి, ఆలవడ్డ గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

'చెత్త' రాజకీయం


పూడిక తీత పనులను అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు

భామిని: మండలంలోని పెద్దదిమిలి దళిత వాడలో సర్పంచ్ తొగరాన శ్రీను ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను టీడీపీ కార్యకర్తలు పలువురు మంగళవారం అడ్డుకున్నారు. సర్పంచ్ శ్రీనును దుర్భాషలాడుతూ పారిశుద్ధ్య పనులు నిలుపుదల చేయాలని వీరంగం చేశారు. ఇదే టీడీపీ కార్యకర్తలు భామిని మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వెళ్లి దళితవాడలో మురుగు నీరు తరలింపు చర్యలు చేపట్టాలని విన్నవించారు. సోమవారం ఫిర్యాదు చేసిన వారే మంగళవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులు నిలుపుదల చేయాలని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని సర్పంచ్ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో రాజకీయాలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు.

పల్లంకివలసలో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్


పల్లంకివలసలో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: పల్లంకి, పల్లంకివలస తదితర గ్రామాల్లో మంగళవారం ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి మోహనరావు మాట్లాడుతూ గిరిజనులు ప్రతీ ఇంట్లో తప్పనిసరిగా దోమల నివారణా మందును స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యం


పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కురుపాం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా సాగు చేస్తున్న నవధాన్యాల పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, రాగులు, అరికలు, జొన్నలు సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పంటలు వాతావరణ పరిస్థితులను, తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడులు ఇస్తాయన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులంతా ఐక్యంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వైటీసీలో మంగళవారం పలు సంఘాల గిరిజన సంఘాల నాయకులు సమావేశమై ఆదివాసీ ఉత్సవాల నిర్వహణ, కార్యచరణపై చర్చించారు.

ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. గిరిజనులంతా ఐక్యంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు నాయకులంతా కలసి రావాలని కోరారు. ప్రభుత్వమే ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఆ రోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, వెంపటాపు భారతి, మండంగి భూషణరావు, కె.మల్లేశ్వరరావు, కద్రక కళావతి, అడ్డాకుల కృష్ణారావు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


కురుపాం: కురుపాంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


గరుగుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ జయ, తదితరులు

కురుపాం నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పక్షోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రజలతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కురుపాంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

– సాక్షి కురుపాం నెట్‌వర్క్


కొమరాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి శ్యామల, మండల స్థాయి అధికారులు


గుమ్మలక్ష్మీపురం: లుంబేసులో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ సీతమ్మ, పంచాయతీ సిబ్బంది

చెత్త సేకరణ కేంద్రాలకు తరలింపు

భామిని: ప్రతీ పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రాలకు విధిగా చెత్తను తరలించాలని ఎంపీడీఓ ఎం.కిశోర్‌కుమార్, ఈఓపీఆర్డీ కె.కృష్ణారావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో వారు మంగళవారం సమావేశయ్యారు. శానిటేషన్ డ్రైవ్‌పై పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టి పేరున ఏర్పాటు చేసిన చెత్త కేంద్రాలు ఉపయోగంలోకి వచ్చేలా కనీస చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బురద రోడ్డుతో తప్పని బాదలు


గుమడ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన లారీ

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు అంతఃరాష్ట్ర రహదారిపై గుమడ గ్రామ వద్ద మంగళవారం కర్రలు లోడుతో వెళ్తున్న లారీ నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనలు నిలిచిపోయాయి. వాహన యజమానులు, డ్రైవర్లు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి రాయఘడ వైపు వెళ్లే అంతఃరాష్ట్ర రహదారిపై గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: గొర్రెలు మేకల పెంపకం దారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైజాగ్ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలోని ఎన్జీఓ హోమ్ వద్ద నిర్వహించిన గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం విస్తత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గొర్రెలు,మేకలు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని, నట్టల నివారణ మందులు, అవసరమైన వ్యాక్సిన్‌లు ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఉపాధిహామీ ద్వారా షెడ్‌ల నిర్మాణానికి ఇస్తున్న 70 శాతం సబ్సిడీని 90 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీసీ రుణాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ, గొర్రెలు, మేకలకు ఉచిత ఇన్సూరెన్స్ కల్పించాలని, మృతి చెందిన జీవానికి రూ.6 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయకులు రండి అచ్యుతరావు, అల్లు రామకృష్ణ, తిరుపతి, వెంకటరమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథాలమ్మ వారాల పండుగ


వెంకటరాజపురంలో ఘటాల ఊరేగింపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో రథాలమ్మ వారాల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. ఘటాలు ఇంటి ముంగిటకు రాగానే మహిళలు తమ ఇళ్లలో వండిన పిండివంటలను అందులో వేసి మొక్కులు చెల్లించారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని, గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల విశ్వాసం. బుధవారం ఘటాలను రథాలమ్మ గుడివద్దకు తీసుకొచ్చి కోళ్లు, గొర్రెలతో పాటు చీరలు చూపించి మొక్కులు చెల్లించుకుంటారు.

పక్షోత్సవాలను బాధ్యతగా నిర్వహిద్దాం


పాలకొండ రూరల్: అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ తదితరులు


వీరఘట్టం: ఎంపీడీఓ ఆధ్వర్యంలో వైద్యారోగ్య, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ


భామిని: ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకై నిర్ణయించిన పారిశుద్ధ్య పక్షోత్సవాలను అన్ని శాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో నిర్వహిద్దామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో 32 పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, తాగునీటి వనరుల పరిశుభ్రత, అంటు రోగాలు, జ్వరాల నియంత్రణకు శాఖల వారీగా అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయా శాఖల అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు అవిష్కరించారు. గ్రామాల్లో విద్యార్థులతో కలసి అవగాహనా ర్యాలీలు చేయించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి అశోక్‌కుమార్, వైద్యాధికారులు కమల్‌నాథ్, రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: పరిసరాల పరిరక్షణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం అన్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం వీరఘట్టం మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఆగస్టు 2వ తేదీ వరకు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులను అన్ని గ్రామాల్లో చేపట్టాలని సూచించారు. ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆర్.ఆనందరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట: పారిశుద్ధ్య పక్షోత్సవాల ర్యాలీ, మానవహారం మంగళవారం సీతంపేటలో నిర్వహించారు. ఎంపీపీ బి.ఆదినారాయణ చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు. వచ్చే నెల 2వ తేదీ వరకు జరగనున్న పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో ప్రజలంతా పాల్గోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, ఏపీఓ చిన్నబాబు, స్పెషలాఫీసర్ సింహాచలం, ఎంపీడీఓ గీతాంజిలి, ఈఓపీఆర్డీ సత్యం, డిప్యూటీ ఈఓ నారాయుడు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సింగన్నవలసలో..

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో మంగళవారం నుంచి పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నామని సర్పంచ్ చేబోదుల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో గ్రామ సభ నిర్వహించి, పారిశుద్ధ్య వారోత్సవాల పోస్టరు ఆవిష్కరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ కాయల దామెదరరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భామినిలో..

భామిని: మండల కేంద్రంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మండల అధికారులు పారిశుద్ధ్య వారోత్సవాల ప్రచార ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం కోరారు.

జొన్నపంట పరిశీలన


జొన్నపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, ఏఓ హర్షలత

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడిలో సాగు చేస్తున్న జొన్న పంటను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి మంగళవారం పరిశీలించారు. రైతులు వీరఘట్టంలో జొన్నవిత్తనాలు కొనుగోలు చేశారని, పూర్తిస్థాయిలో మొలకెత్తలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంటను పరిశీలించారు. సరిగా మొలకెత్తకపోవడంతో విత్తనాల ఖరీదును రైతులకు తిరిగి చెల్లించాలని సంబంధిత డీలర్‌ను ఆదేశించారు. ఇటువంటి మొలకెత్తని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట వీరఘట్టం వ్యవసాయాధికారి జె.సౌజన్య, జియ్యమ్మవలస వ్యవసాయాధికారి కె.హర్షలత ఉన్నారు.

ఘనంగా వారాల పండగ


అమ్మవారి ఘటాన్ని మోస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో మంగళవారం దేశతల్లి, చింతల పోలమ్మ అమ్మవార్ల వారాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను మేళతాళలతో గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. గ్రామస్తులంతా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్ పనులు ప్రారంభానికి ముందు అమ్మవారికి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకొని మొక్కు చెల్లించుకున్నారు.

భారీ వర్షం

పాలకొండ: పాలకొండ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుంచి గంట పాటు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో రహదారులు జలమయంగా మారాయి. పట్టణంలోని పలు వీధుల్లో వర్షం నీరు రెండు అడుగుల ఎత్తులో ప్రవహించింది. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ముగిసిన రథయాత్ర ఉత్సవాలు


రథంపై ఉన్న జగన్నాథస్వామి విగ్రహాలు

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన ఉత్సవాలు రథం ప్రధాన ఆలయం వరకు రావడంతో యాత్ర ముగుస్తుంది. ఈ సందర్భంగా చివరి రోజు వేల సంఖ్యలో భక్తులు యాత్రలో పాల్గొన్నారు. రథంపై జగన్నాథ స్వామి విగ్రహాలను ఉంచి భక్తులు రథాన్ని లాగుతూ ప్రధాన అలయానికి తీసుకువచ్చారు. రథం లాగేందుకు భక్తులు పోటీ పడడంతో తోపుటాట జరిగింది. రథం పైనుంచి అర్చకులు స్వామి వారి ఆలయ చరిత్ర వివరించారు. ఈ సందర్భంగా బాణ కాల్చి ఉత్సవాలకు ముగింపు పలికారు.